TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 47 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.10.09.2025 పేజీలు : 8, వెల:రూ.2.00




## సందర్శకులకు సకల సౌకర్యాల కల్పన



ములుగు : అమృత్ తెలంగాణ: వచ్చే సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని సందర్శకులకు సకల సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో జరుగునున్న పనులను పరిశీలించడానికి వారంలోగా ముఖ్యమంత్రి మేడారాన్ని పర్యటిస్తారని తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి(ఎస్ఎస్) మండలం మేడారం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వీఐపీ పార్కింగ్ రోడ్డు, పోలీస్ కంట్రోల్ రూమ్, హరిత హౌటల్ తదితర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బానోతు రవిచంద్రతో కలసి మంత్రి పరిశీలించారు. అనంతరం మేడారంలోని ఐటీడీఏ సమావేశం హాల్లో అమ్మవార్ల పూజారులు, అన్ని శాఖల అధికారులతో శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర–2026పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.150 కోట్లు కేటాయించిందని, ఆయా శాఖల అధికారులు 100 రోజుల నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గద్దెల ప్రాంతంలో పూజారుల మనోభావాలు దెబ్బ తినకుండా వారి సూచనల మేరకు నూతన హంగులతో శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేయాలని తెలిపారు. మేడారం గ్రామస్తులు, పూజార్ల అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పండుగగానే కాకుండా మరో కుంభమేళా తరహాలో జరగనున్న జాతరకు సామాన్య పౌరుని నుంచి రాష్ట్రపతి, ప్రధానమంత్రి లాంటి ముఖ్యులు హాజరయ్యే అవకాశం ఉన్నదని అన్నారు. వీఐపీలకు ఇబ్బందులు రాకుండా విమానాలు సైతం దిగే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈసారి చేపట్టనున్న పనులు శాశ్వతంగా ఉండే విధంగా నాణ్యతగా జరిగేలా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

వనదేవతల ప్రాంతంలో రాజకీయాలు చేసే ఏ రాజకీయ నాయకుడు ఎదగలేదని, రానున్న మహా జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ స్థపతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఈ శివనాగిరెడ్డి, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఈఓ వీరస్వామి, ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి విజయం



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఎన్డేయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 152 ఓట్ల మెజార్జీతో విక్టరీ సాధించారు. రాధాకృష్ణన్‌కు 452, ఇండియా బ్లాక్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. మొత్తం 781ఓట్లకు గాను మొత్తం 767 ఓట్లు పోలయ్యాయి. ఎన్డేయే బలం 427 కాగా.. క్రాస్ ఓటింగ్ జరగడంతో 452 ఓట్లు వచ్చాయి. దీంతో దేశంలోని 17వ ఉపరాష్ట్రపతిగా సీసీ రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అదే విధంగా ఆప్, ఆర్జేడీకి చెందిన ఎంపీలు క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారు. ఇండియా కూటమి అభ్యర్థికి ఆప్, ఆర్జేడీ మద్దతు తెలిపినప్పటికీ..ఆ పార్టీ ఎంపీ స్వాతి మాలివాల్, అలాగే ఆర్జేడీ ఎంపీ గిరిధర్ లాల్ యాదవ్ ఎన్డీయే కూటమి అభ్యర్థికి ఓటు వేశారు. ఇక బీఆర్ఎస్, బీజేడీ ఈ ఎన్నికకు దూరంగా ఉన్నాయి. అలాగే పంజాబ్‌లోని శిరోమణి అకాలీదళ్ (SAD) కూడా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలావుండగా లోక్‌సభలో 543 మంది ఎంపీలు ఉండగా.. రాజ్యసభలో 233 మంది సభ్యులు ఉన్నారు. ఇక 12 మంది నామినేటెడ్ సభ్యులు ఉండగా.. 5 రాజ్యసభ, 1 లోక్‌సభ స్థానం ఖాళీగా ఉంది. 781ఓట్లకు గాను మొత్తం 767 ఓట్లు పోలయ్యాయి. ఈ ఏడాది వర్షాకాల పార్లమెంట్ సమావేశాల ప్రారంభంలోనే జగదీశ్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఆయన రాజీనామాతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

## తుపాకీ నీడలో యూరియా పంపిణీ




అమృత్ తెలంగాణ: యూరియా కోసం రైతన్న తిప్పలు కొనసాగుతూనే ఉన్నాయి.. తెల్లవారకముందే పెద్దఎత్తున రైతులు కార్యాలయాల వద్ద లైన్ కట్టడం.. వచ్చిన యూరియా తక్కువగా ఉండటంతో మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల అందరికీ అందకపోవడంతో రైతులు ధర్నాలు చేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద పోలీసు పహారా మధ్య యూరియా పంపిణీ కొనసాగింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా 52 టన్నులు, కిష్టాపూర్ అగ్రోస్ సెంటర్ ద్వారా 38 టన్నుల యూరియా పంపిణీ చేసినట్టు స్థానిక వ్యవసాయ అధికారి సాయికృష్ణ తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో యూరియా కోసం రైతుల ధర్నా నిర్వహించారు. మార్కెట్ కమిటీ కార్యాలయం సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం సొసైటీలో వద్ద యూరియా కోసం వచ్చిన బచ్చువారిగూడెం పంచాయతీ జెట్టివారిగూడెం రైతు సింగరాజు అనారోగ్యానికి గురై సొమ్మసిల్లి పడ్డాడు. ఆయన చెవిలో నుంచి రక్తం రావడంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. జయశంకర్–భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద యూరియా బస్తాల కోసం రైతులు బారులు తీరారు. ఎండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గణపురం మండలంలో సొసైటీకి యూరియా బస్తాల లారీ వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు భారీగా తరలొచ్చారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. వరంగల్ జిల్లా నెక్కొండ లో ఉదయం 5 గంటలకే టోకెన్ల కోసం మహిళలు, రైతులు క్యూ కట్టారు.

అర్ధరాత్రి నుంచి లైన్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో యూరియా కోసం రైతులు అర్ధరాత్రి రెండు గంటలకు లైన్ కట్టారు. మార్కెట్లో ఉన్న డివైడర్‌పై కునుకు తీశారు. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లి.. మహిళల ను యూరియా కోసం గజ్వేల్‌కు పంపిస్తే.. అక్కడ వారి మధ్య గొడవ జరిగి చెప్పులతో కొట్టుకున్నారు. 500 మందికి టోకెన్లు ఇచ్చిన వ్యవసాయ అధికా రులు.. 250 మందికి మాత్రమే యూరియా ఉండటంతో.. ఆందోళనతో వరుస తప్పి వస్తున్న మహిళల మధ్య గొడవ ప్రారంభమైంది. మర్కుక్ రైతు వేదిక వద్ద టోకెన్లు, ఓటీపీల కోసం రోజంతా పడిగాపులు కాశారు.

ఒకే రోజు మూడుసార్లు రాస్తారోకో

నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలో రైతులకు సరిపడా యూరియా ఇవ్వకపోవడంతో మూడుసార్లు రాస్తారోకో నిర్వహిం చారు. రెండు వందల టోకెన్లు ఇవ్వగా.. ఐదు వందల మందిపైగా రైతులు ఆగ్రో సెంటర్ల వద్ద బారులు తీరారు. ప్రధాన రహదారిపై బైటాయించారు.

## కరీంనగర్‌లో హైటెన్షన్..

కరీంనగర్ : అమృత్ తెలంగాణ: కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం హైటెన్షన్ నెలకొంది. రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజరుకుమార్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, సీపీఐ శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ యూరియా విధానం వల్ల రాష్ట్ర రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ‘గ్రూప్-1’పై జ్యుడీషియల్ కమిషన్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: గ్రూప్–1కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బేషజాలకు పోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. ప్రతిష్టకు పోయి నిరుద్యోగులకు నష్టం చేకూర్చొద్దని విజ్ఞప్తి చేశారు. గ్రూప్–1కు సంబంధించి మంగళవారం రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని నందినగర్‌లోగల తన నివాసంలో కేటీఆర్ పలువురు అభ్యర్థులతో భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహించిన విధానం, దాంట్లో జరిగిన అవకతవకలు, అభ్యర్థులకు జరిగిన నష్టం తదితరాంశాలపై ఆయన వారితో చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రీవాల్యుయేషన్‌కు పోవద్దనీ, గతంలో తప్పు చేసిన వారి చేతికే మళ్లీ సమస్యను అప్పజెప్పొద్దని ప్రభుత్వానికి సూచించారు. తిరిగి పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన విధంగా అవకతవకలు జరిగాయనే విషయాన్ని గుర్తించాలని సర్కారుకు సూచించారు. టీఎస్‌పీఎస్సీ అవినీతి, పరీక్షల అస్తవ్యస్త నిర్వహణపై జ్యుడీషియల్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా పూర్తి స్థాయి విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే ఉద్యోగాలను అమ్ముకుంటూ వ్యాపారం చేసిన బ్రోకర్లు, తప్పులు అధికారులు కలుగులోంచి బయటకొస్తారని ఎద్దేవా చేశారు. ఏదేమైనా హైకోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తెలంగాణ విద్యార్థులకు ప్రతీయేటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మాట వాస్తవమైతే, ఈ అంశంపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరచాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులనూ వెంటనే ఎత్తేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వానికి చెంపపెట్టు : హరీశ్‌రావు

గ్రూప్–1కు సంబంధించి హైకోర్టు వెలువరించిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. లోప భూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు వారికేం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా కండ్లు తెరవాలనీ, తప్పులు సరిదిద్దుకుని, యువతకు క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్‌కు ఆయన హితవు పలికారు.

## విద్యాభివృద్ధికి సహకరించండి




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: తెలంగాణ విద్యారంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్న కృషికి అన్ని విధాలుగా సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. విద్యారంగంలో సంస్కరణల కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 30వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చేస్తున్న ఈ వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడిక్కడ నార్త్ బ్లాక్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెంపు, గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులకు లోన్ల రీస్ట్రక్చర్, ఇతర ఆర్థిక అంశాలపై చర్చించారు.

రూ.30 వేల కోట్లతో విద్యా రంగ అభివృద్ధి ప్రణాళిక

తెలంగాణలో దాదాపు రూ.30 వేల కోట్లను విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలోని 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్టు చెప్పారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఇప్పటికే నాలుగు స్కూళ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయని అన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని వివరించారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వ అప్పులను రీస్ట్రక్చర్ చేయండి

గత ప్రభుత్వం ఇష్టారీతిగా అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ఆ వడ్డీల చెల్లింపులతో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర భారం పడుతోందని తెలిపారు. అందువల్ల వాటిరీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కోరారు. కాగా తమ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎంఓ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



## ఎండోమెంట్ భూములు, భూ భారతిలో నమోదైన సాదాబైనామాలు, అసైన్డ్ ల్యాండ్ దరఖాస్తుల పై గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం రోజు తన క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.









అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి : ఈ సమావేశంలో సబ్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లు, AO , రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. గూగుల్ మీట్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ మండలాల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, భూ పరమైన వివాదాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి రెవెన్యు సదస్సులో వచ్చిన సాదాబైనామా, అసైన్డ్ లాండ్ కు సంబందించిన దరఖాస్తులు ఎన్ని, అందులో ఎన్ని నోటీసులు జనరేట్ చేసి సర్వే ప్రక్రియ పూర్తి చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయి, పెండింగ్ కి గల కారణాలను కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు ఎక్కువ పెండింగ్ ఉన్న మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి, వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు . RDO లాగిన్ లో ఉన్న విరాసిత్, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేరు, సర్ నెమ్ , తదితర పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని తెలిపారు ప్రతి ఒక్క దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలని,అదేవిధంగా భూ భారతి అప్లికేషన్‌లో నమోదవుతున్న సాదా బైనామాలు, వాటి పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అంతకు ముందు గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 11న జిల్లాకు రానున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలనీ, జిల్లాలోని పలు కార్యక్రమాలకు ప్రోహిబిషన్ / ఎక్సైజ్, పర్యాటక, సంస్కృతి పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు, ముఖ్యంగా భోరజ్ మండలం పిప్పర్ వాడ లో ఇందిరమ్మ ఇల్ల నిర్మాణం పూర్తయిన సందర్భంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు . బోథ్, ఇంద్రవెల్లి, అదిలాబాద్ రూరల్ లో పలు కార్యక్రమాలను ప్రారంభించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రివ్యూ మీటింగ్ కి హాజరవుతారని , అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యు విభాగం ,,తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్



హాజరైన అధికారులు


అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ముడి సరుకులు, మ్యాన్ పవర్ అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లభించిన అనుమతులు, వివిధ దశల వారిగా నిర్మాణం పూర్తయిన ఇండ్లకు సంబంధించి వివరాలను మండలాల వారిగా సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక కష్టాలు ఉన్న వారిని గుర్తించి, మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని పేర్కొన్నారు. ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హౌసింగ్ పిడి రాజేశ్వర్, మండల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఒక కెమెరా 100 పోలీసులతో సమానం.

**50 సీసీ కెమెరాలు ప్రారంభం.**
**కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఐటీడీఏ పీఓ**
**సీసీటీవీ నిఘా నీడలో ఉట్నూర్ మరియు ఇంద్రవెల్లి మండల కేంద్రాలు.**
**ఉట్నూరు పోలీస్ స్టేషన్ నందు కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ప్రారంభించిన**
**జిల్లా ఎస్పీ, ఐటిడిఏ పిఒ, ఏఎస్పి ఉట్నూర్**
**30 రోజుల బ్యాక్అప్ తో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం.**
**నిష్ణాతులైన సిబ్బందితో 24 గంటలు పర్యవేక్షణ.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి నేరాల నియంత్రణ మరియు నేరాలను అరికట్టడానికి ఉట్నూర్ మరియు ఇంద్రవెల్లి మండల కేంద్రాలలో 50 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఈరోజు ఉట్నూర్ పోలీస్ స్టేషన్ నందు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేసి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా ఐఏఎస్ మరియు ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్ కలిసి ప్రారంభించారు. ఒక కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా విధులను నిర్వర్తిస్తుందని ఎలాంటి సమస్యలనైనా ఛేదించేందుకు వీలుగా సీసీటీవీ కెమెరాలు ఉపయోగపడతాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఉట్నూర్ నందు ప్రారంభించిన కమాండ్ కంట్రోల్స్ సెంటర్లో ఉట్నూరు నందు 37 సీసీటీవీ కెమెరాలు మరియు ఇంద్రవెల్లి నందు 13 సీసీటీవీ కెమెరాలతో ప్రధానమైన కూడళ్లను సీసీటీవీ నిఘానేత్రంలో ఉంచి, నిష్ణాతులైన సిబ్బందిచే 24 గంటలు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రారంభించిన సిటీ కెమెరాలు అధునాతన టెక్నాలజీని సాంకేతికతను కలిగి ఉన్నాయని రాత్రి సమయంలో, పగటి సమయంలో తేడా లేకుండా సరైన స్పష్టమైన దృశ్యాలను చూపిస్తుందని, 30 రోజుల బ్యాక్అప్ తో కలిగిన వాటిని ఈరోజు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఈ సీసీటీవీ కెమెరాలకు సహకరించిన ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా ఐఏఎస్ గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివాసుల ఖిల్లా ఉండేటువంటి ఉట్నూర్ ఇంద్రవెల్లిలలో ఎలాంటి నేరాలకు ఆస్కారం లేకుండా నేరస్తులను త్వరితగతిన పట్టుకునేందుకు మరియు దొంగతనాలు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు కారకులను గుర్తించడంలో ఈ సీసీటీవీ కెమెరాలు తమ వంతు కీలక పాత్ర పోషిస్తూ కేసు చేతనలో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సిఐ మడవి ప్రసాద్, నార్నూర్ సీఐ పి ప్రభాకర్, ఎస్సైలు కె ప్రవీణ్, అఖిల్, మనోహర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ ప్రజల హృదయాలకు హత్తుకునేలా, తెలంగాణ యాసలో కవితలు రాసి ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన కృషికి గుర్తింపుగా ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు అందజేసిందని గుర్తుచేశారు. కాళోజీ పుట్టినరోజుని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడం ద్వారా భావితరాలకు వారి గొప్పతనం చేరువవుతుందని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు నరసింహారెడ్డి, రమణ, శ్రీకాంత్ రెడ్డి, మోహన్ సింగ్, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ సమీపంలోని చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే స్టాళ్లు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, పలు పథకాల కింద ధ్రువీకరణ పత్రాల పంపిణీకి సంబంధించి, ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. అదేవిధంగా స్టాల్స్, సీటింగ్, స్టేజ్, పార్కింగ్ వంటి అంశాలను పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశిత సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు రాజు, సంతోష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విష జ్వరాలతో హాస్టల్ విద్యార్థులు.... పట్టించు కొని అధికారులు ప్రభుత్వం




మాట్లాడుతున్న జనసేన నాయకులు మహేష్

నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 8 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో విష జ్వరాలతో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్ లో విద్యార్థుల పరిస్థితి దయానీయంగా మారింది. దీన్ని జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం కనబరుస్తుంది అసలే సీజనల్ వ్యాధులతో అనారోగ్యాల బారిన పడి హాస్పిటల్ లో వందలాది మంది చికిత్స పొందుతున్నారు. హాస్టల్ నుండి విద్యార్థులను ఇంటికి పంపిస్తున్నారు హాస్టల్ లో సరైన వైద్యం లేక,దోమ తెరలు, ఫాన్స్,సరిగ్గా భోజన సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రాణాలు గుప్పెట్లో పెట్టు కోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ప్రభుత్వం హాస్టల్స్ అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసింది ఏమి లేదు. వెంటనే హాస్టల్స్ లలో అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించి పిల్లల భవిష్యత్తును కాపాడాలని కోరుతున్నాం లేని యెడల హాస్టల్స్ ముందర పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు రామోజీవార్ గంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకుందాం.... బడుగు బలహీన వర్గాల నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలి సుంకేట పోశెట్టి



బీసీ నాయకులు సుంకేట పోశెట్టి




నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 8 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కలెక్టరేట్లో బీసీ సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో చిట్యాల చాకలి ఐలమ్మ 40. వ. వర్ధంతి సభ జిల్లా కేంద్రం లో కలెక్టర్ కార్యాలయంలో, నిర్వహించ బడును కావున ఇ కార్య క్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు. సమయం ఉదయం 10.30.నీ.లకు కాబట్టి ఇట్టి సభ కు జిల్లాలోని బడుగు బలహీనవర్గాలనాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించాలని తెలంగాణ ఐలమ్మ రజక సంఘం నాయకులు సుంకేట పో శెట్టి కోరారు


# గ్రామాల అభివృద్ధికి రూ 13.78 కోట్లు విడుదల



అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : గ్రామాల్లోని పలు కాలనీ లలో అభివృద్ధి పనుల కోసం ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూపాయలు 13.78 కోట్లు విడుదల అయ్యాయని ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల్ శంకర్ తెలిపారు గత కొన్ని సంవత్సరాల నుంచి కాలనీలో మురికి కాలువలు ఇతర రోడ్ల అభివృద్ధి కోసం పలు గ్రామాల నుంచి వచ్చిన వినతి మేరకు నిధుల విడుదలకై ప్రతిపాదించగా జిల్లాకు ఎస్సీ సబ్ ప్లాన్ కింద కింద నిధులు విడుదల కావడంతో అభివృద్ధి పనులకు మార్గం సుగమం అయిందని ఆయన అన్నారు గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధుల విడుదలకు కృషి చేయడం పట్ల షెడ్యూల్ కులాల వారు హర్షం వ్యక్తం చేశారు కాలనీలో మురికి కాలువ లేక ఇటీవల కురిసిన వర్షాలతో దుర్గంధం పేరుకుపోయిందని సమస్యలున్న గ్రామాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు

## మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి ఎస్పీ:అశోక్ కుమార్



ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 09 ఈనెల 13న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాజీ పడదగిన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన, కుటుంబ నిర్వాహణ, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు వంటివి రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.

## ఇబ్రహీంపట్నం మండలంలో కరీంనగర్ డైరీ పాల విక్రయ కేంద్రం ప్రారంభం

### యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక వనరులు సృష్టించుకోవాలి :ఎమ్మెల్యే సంజయ్



పాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 9 జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోమవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కరీంనగర్ డైరీ పాలకేంద్ర విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ డైరీ పాడి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతూ, పాల పరిశ్రమలో రాణిస్తూ రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. వ్యవసాయంతో పాటు పాల ఉత్పత్తి ద్వారా రైతులు ఆదాయ వనరులు సృష్టించుకుని ఆర్థికంగా ఎదగడానికి సంస్థ సహకారం అందిస్తుందని, దీని ద్వారా లక్ష కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక వనరులు సృష్టించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ తో పాటు జాజాల జగన్ టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నియోజకవర్గంలో మైనార్టీ పాఠశాలల భవనాలను మంజూరు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఖానాపూర్ శాసనసభ్యులు బొజ్జు పటేల్

అమృత్ తెలంగాణ ఖానాపూర్ నియోజకవర్గ న్యూస్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు వికలాంగుల సంక్షేమ శాఖల మంత్రి వర్యులు 'అడ్లూరి లక్ష్మణ్ కుమార్' మంగళవారం రోజున సచివాలయంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ 'మహ్మద్ అబ్దుల్లా కొత్వాల్' కలిసి ఖానాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు 'వెడ్మ బొజ్జు పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు.బి నియోజకవర్గంలోని ఉట్నూర్ మరియు ఖానాపూర్ లలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల ఏర్పాటుకు మంజూరు చేయాలని మంత్రి అడ్లూరి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పదించిన మంత్రి పాఠశాల భవనాలను మంజూరు చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



మంత్రి అల్లూరి లక్ష్మన్ కుమార్ కలిసిన ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మినిస్టర్ క్వాటర్స్ లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ మైనార్టీ దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఇటీవలే నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసినందుకు నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు మరియు నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు సానుకూలంగా స్పందించిన రాష్ట్ర మంత్రి త్వరలో మరిన్ని నిధులు మంజూరుకు సహకరిస్తా అని తెలిపారు ఆయన వెంట నాయకులు బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, యువ నాయకులు యండి సద్దాం,మౌలానా తదితరులు ఉన్నారు

## జోగన్ పల్లి గ్రామం లో ఘనం గా అయోధ్య రామ రథ రథోత్సవం...



అమృత్ తెలంగాణ కోరుట్ల రూరల్ సెప్టెంబర్ 9 జోగన్ పల్లి గ్రామం లో అయోధ్య రామ రథోత్సవం విజయవంతం గా జరిగింది.ఆడపడుచులు మంగళ హారతులతో గ్రామ ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## గడప గడపకు పాలజ్ వినాయకుని లడ్డూ ప్రసాదం అందించిన డాక్టర్ సాప పండరి.

### ఆయనను శాలువాతో సన్మానించిన అభిమాని శ్రీ అలికే ఉమామహేశ్వరి ఆనంద్ దంపతులు....



దళిత కుటుంబానికి మొదటి ప్రసాదాన్ని శ్రీమతి శ్రీ లక్ష్మి సురేష్, లకు లడ్డును అందించిన దృశ్యం శాల్వాతో పండరి,ని సన్మానించిన దళిత కుటుంబం దృశ్యం.



కుబీర్ లో గడపగడపకు లడ్డు ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం



మహా లడ్డు ప్రసాదాన్ని అందుకుంటున్న ముస్లిం సోదరుడు


నిర్మల్ జిల్లా కుబీర్ సెప్టెంబర్8 అమృత్ తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన పాలజ్ వినాయకుని పవిత్రమైన నవరాత్రులు పూజలు విశిష్టమైన పూజలు అందుకున్న లడ్డును వేలం పాటలో భాగంగా, సామాజిక సేవకుడు, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం చైర్మన్ డాక్టర్ సాప పండరి ఒక లక్ష రెండు వేల రూపాయలకు దక్కించుకోగా, అట్టి మహా ప్రసాదాన్ని తన కుబీర్ గ్రామంలోని గడప గడపకు పేద, మధ్య, ధనిక అనే భేదం లేకుండా ప్రతి ఇంటికి లడ్డును పంచడంతో, భక్తులు ఎంతో సంతోషిస్తున్నారు. ఇంతటి మహా ప్రసాదం మా ఇంటి వరకు రావడం మా అదృష్టమని వృద్ధులు అంటూ ఉంటే, సాప పండరి మాట్లాడుతూ మా అమ్మ సాప లక్ష్మి జ్ఞాపకార్థంగా గత సంవత్సరం నుండి ఈ విధంగా ప్రతి ఇంటికి లడ్డూను చేర్చాలని నిర్ణయించుకున్నట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీమతి శ్రీ అలికే ఉమామహేశ్వరి, ఆనంద్ డాక్టర్ సాపండర్ కి శాలువాతో ఘనంగా సన్మానించి, తన కూతురు సాప ధరణి శ్రీ కి జాకెట్ కనులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జె డబ్ల్యూ హెచ్ ఆర్ సి బైంసా ప్రతినిధులు మాలేవార్ గోవిందు, గంధముల ప్రకాష్, మిత్రులు కోల్సిక్వార్ సతీష్ పలువురు పాల్గొన్నారు

## జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం

### ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్

### కక్షిదారులు సద్వినియోగ పరచుకోవాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ విజ్ఞప్తి

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా కక్షిదారులు కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన , తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్నహాజాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా ఎస్పీ తెలపడం జరిగింది. ఈ సందర్భంగాజిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. 13.09.2025 రోజున నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియ జేశారు.ఇందులో చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు , సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు.అంతేకాకుండా, ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావున, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టు



లో గల కేసులలో త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

## బతుకమ్మ పండుగకు ఇందిరమ్మ చీరలు కోరుట్ల నియోజకవర్గ ఆడపడుచులకు శుభవార్త .

### కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు:అందే భవితరాణి

కోరుట్ల అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 09 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచులు చిన్నలు పెద్దలు కలిసి ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి మహిళ లబ్ధిదారికి రెండు ఇందిరమ్మ చీరలు ఉచితంగా ఇవ్వనున్నట్లు మహిళా కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షురాలు అందే భవితరాణి తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల చేనేత కార్మికుల చేత 65 లక్షల చీరల తయారీకి ఆర్డరు ఇచ్చింది అన్నారు మొత్తం 318 కోట్ల ఖర్చుతో దాదాపు 9 కోట్ల మీటర్ల బట్ట తయారీకి అనుమతి ఇచ్చింది అన్నారు. ఇప్పటికే 36 లక్షల చీరలు సిద్ధం అయ్యాయని తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు ఉత్పత్తి పూర్తి చేయనున్నారని శ్రీమతి భవితారాణి వివరించారు. ప్రతి చీర విలువ సుమారు800 రూపాయలు ఉంటుందని ఆమె తెలిపారు. ఈ చీరల పంపిణీ కార్యక్రమంతో తెలంగాణ ఆడపడుచులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంత గౌరవం ఉందో దీనితో రుజువైందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం వల్ల బతుకమ్మ చీరల పంపిణీ తో పాటు సిరిసిల్ల చేనేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుందని భవితరాణి తెలిపారు.



కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షులు అందే భవితా రాణి

## తెలంగాణలి బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపిన అజయ్ కుమార్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ నూతనంగా నియమితులైన తెలంగాణ బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆత్మకూరి కాంతి కిరణ్ కు శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అజయ్ కుమార్ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సోమవారం అన్ని మోర్చాల అధ్యక్షులను నియమించారు అందులో భాగంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉన్న కాంతి కిరణ్ కు అధ్యక్షునిగా నియమించారు రాష్ట్ర దళిత మోర్చా అధికార ప్రతినిధి అజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపి తెలంగాణ లో బీజేపీ ప్రభుత్వం వచ్చేటట్టు దళితులని బీజేపీకి ఓటు వేసే విధంగా చైతన్య చేద్దామని అన్ని జిల్లాలు పర్యటనలు చేసి తెలంగాణా లో బీజేపీ ప్రభుత్వం వచ్చే విధంగా శ్రమిద్ధమని అన్నారు నూతన తెలంగాణ బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుణ్ణి కోరారు

## పంట నష్టపరిహారం ఇవ్వాలని తహశీల్దార్ కు వినతి..

ముధోల్ :అమృత్ తెలంగాణ: భారీ వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం ముధోల్ రైతులు తహశీల్దార్ శ్రీలత కు వినతిపత్రం అందజేశారు. ఎకరానికి రూ. 30వేల చొప్పున నష్టపరిహారం అందివ్వాలని పేర్కొన్నారు. అతి భారీ వర్షాల కారణంగాపంట చేలల్లో ఇసుక పేరుకుపోయి వరదలకు కొట్టుకుపోయిన,దెబ్బతన్నయాని వారు తెలిపారు. నష్ట పోయిన ప్రతిరైతుకు నష్ట పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్ ,మండల బిజెపి అధ్యక్షులు కోరి పోతన్న, బిడిసిఅధ్యక్షులు విట్టల్, మాజీ సర్పంచ్ అనిల్, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

# విచ్చల విడిగా అక్రమ కట్టడాలు

**మెట్ పల్లిలో జోరుగా అక్రమ నిర్మాణాలు**
**ఇచ్చేది రెసిడెన్స్ పర్మిషన్.. కట్టేది మాత్రం కమర్షియల్**
**అక్రమ ఇంటి అనుమతుల్లో కాసుల కక్కుర్తిలో మున్సిపల్ అధికారులు**
**నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు**
**ఇంటి నిర్మాణాల్లో రూ. కోట్లలో మున్సిపల్ కు నష్టం**
**టౌన్ ప్లానింగ్ లో సిబ్బంది ఆడిందే ఆట**
**ఉన్నతాధికారులు పట్టించుకోవాలంటున్న పట్టణ ప్రజలు**

మెట్ పల్లి అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 09 : మెట్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేవారే లేకుండా పోయారు. ఏ వీధిలో చూసినా రోడ్లను కబ్జా చేస్తూ.. పార్కింగ్‌కు సెల్లార్లను వదిలేయకుండా.. బాల్కానీలను పెంచి బహుళ అంతస్థులు నిర్మిస్తున్నారు. అనుమతులు ఒకదానికి తీసుకుంటూ.. నిర్మాణాలు మరో విధంగా చేపడుతున్నారు. ఇంతజరుగుతున్నా మెట్ పల్లి మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి మున్సిపల్ కమిషనర్లకు సూచించినా వారిలో కదలిక కనిపించడం లేదు.

అడ్డూ అదుపూ లేకుండా అక్రమ కట్టడాలు

మెట్ పల్లి మున్సిపల్ అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో అక్రమ కట్టడాలు కొనసాగుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలను గుర్తించాల్సింది పోయి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. మెట్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీ ప్లస్ టూకే అనుమతి అని ప్రకటించినా అక్రమార్కులు 5 అంతస్థులు భవన నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు జీప్లస్‌టూకు అనుమతి తీసుకొని ఐదు అంతస్థుల భవనాలను, కొన్నింటికి అయితే ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నారు. ఈ విధంగా తప్పుడు అనుమతులతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిద్ర మత్తులో తూగుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకులోనై, మామూళ్లకు అలవాటు పడే అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొందరు పార్కింగ్‌కు సెల్లార్స్ వదిలేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టి యథేచ్ఛగా అద్దెకు ఇచ్చుకుంటున్నారు.

మున్సిపల్ అధికారుల కనుసన్నల్లోనే..

మెట్ పల్లి పట్టణంలో బహుళ అంతస్తు నిర్మాణాలకు నిబంధనల ప్రకారం సెట్ బ్యాక్ ఉండాలి.. కాంపౌండ్ కూడా కొంత స్థలం వదలాలి కానీ.. అలాంటిదేమీ లేకుండా పలు చోట్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాదు.. ఈ కట్టడాలకు పక్కనే ఉన్న డ్రైనేజీలు సైతం ఆక్రమించి మరీ నిర్మిస్తున్నారు. వెనకా ముందు ఏవైనా స్థలాలు ఉంటే ఆక్రమించుకుంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు,కింది స్థాయి సిబ్బంది వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, సిబ్బంది అండతోనే అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

మున్సిపల్ అధికారులకు భారీగా ముడుపులు..

పట్టణంలో ఇలాంటి బహుళ భవంతులు, అక్రమ కట్టడాల నిర్మాణంలో మున్సిపల్ అధికారులు భారీగా ముడుపులు తీసుకుని అనుమతులు మంజూరు చేస్తుంటే.. అధికార,ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు నాయకులకు కూడా ఇలాంటి దందాల్లో వేలు పెట్టి లక్షలు సంపాదిస్తున్నారు. నిర్మాణదారుల నుంచి భారీగా డబ్బులు తీసుకుంటూ దగ్గరుండి పనులకు ఎవరూ అడ్డురాకుండా చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందువల్లే అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు ఎవరూ స్పందించం లేదని తెలుస్తున్నది. ఒకవేళ స్పందించినా తూతూమంత్రంగా నోటీసులు పంపుతున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు.

# ఘనంగా ప్రజాకవి కాళోజి జయంతి..



ముధోల్ :అమృత్ తెలంగాణ: కాలాన్ని ఆయుధంగా మార్చుకుని తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111వ జయంతిని నియోజకవర్గ కేంద్రమైన ముధోల్లోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీలత మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి కాళోజీ బాటలు వేసారని తెలిపారు .ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం ఊపిరిగా జీవించిన ప్రజాకవి, తెలుగు భాష, ప్రజల అవసరాల కోసం కాళోజీ నిరంతరం కృషి చేశారని, అన్నారు.తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి నింపారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బిట్ల పెర్సెస్ ,నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు,తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేష్,బిడిసి అధ్యక్షుడు విట్ఠల్, మాజీ సర్పంచ్ అనిల్, తదితరులు, పాల్గొన్నారు.

# ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖలో ఏఈఈ ల కొరత..

ముధోల్ :అమృత్ తెలంగాణ: ముధోల్ నియోజకవర్గంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంట్రాలో ఏఈఈ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో డిఈఈ రెండు మండలాలకు ఇంచార్జి ఏఈఈ గా విధులు నిర్వహిస్తున్నారు. భైంసా ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంట్రా సబ్ డివిజన్ లో భైంసా, కుబీర్,ముధోల్, బాసర, తానుర్ లోకేశ్వరం మండలాలు ఉన్నాయి. అయితే కుబీర్ మండలానికి ఏఈఈ గా రాజన్న,తానుర్ కు పృథ్వీధర్,లుపనిచేస్తున్నారు. ఇటీవల ముధోల్ మండలానికి ఏఈఈ గా హరిచందన,లోకేశ్వరం కు సాయిప్రసాద్ లు కొత్తగా నియమింతులు అయ్యారు. భైంసా సబ్ డివిజన్ లో ఆరు మండలాల్లో రెండు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తానుర్ ఏఈఈ బాసరమండలం కు ఇంచార్జి గా వ్యవహరిస్తున్నారు. బైంసా డిఈఈ అరుణ్ కుమార్ బైంసా మండలానికి ఇంచార్జి ఏఈఈ తో పాటు కుబీర్ ఏఈఈ అనారోగ్యం సమస్యలు ఎదుర్కోవడంతో అ మండలం కూడా అధనపు భాధ్యతలు నిర్వహిస్తున్నారు. మీషన్ భగీరథ పథకం ప్రారంభం అయిన నుంచి ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంట్రా బాధ్యతలు మరింత పెరిగాయి. మీషన్ భగిరధ గ్రీడ్ వారు గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకు లకు నీటినీ నింపె వరకు బాధ్యత. గ్రామంలో మంచినీటి సరఫరా భాధ్యత స్థానిక గ్రామపంచాయతీ వారు నిర్వహింస్తున్నారు. ఇంట్రా వారే పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఏఈఈల పోస్టులు ఖాళీగా ఉండటంతో అదనపు పని భారంతో డిఈఈ , ఏఈఈలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రాగు నీటి పథకం ల పనితీరు వివరాల ను ఆన్లైన్లో పొందుపరిచాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం పథకం అయిన జల్ జీవన్ మిషన్ లో త్రాగు నీటి పథకంకు సంబంధించిన పూర్తి సమాచారం ను యాప్ లో పొందుపరచాలి. దీంతో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డిఈఈ,ఏఈఈలు కూడా ఇన్చార్జి మండలాల్లో కూడా వీరే ఆన్లైన్ లో పొందుపరస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంచినీటి కోసం వెచ్చించే నిధుల తో చెపట్టె అభివృద్ధి పనులు ఇంట్రా ఆధ్వర్యంలో నిర్వహింస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులకు అదనపు పని భారం తప్పడం లేదు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి

# ఎన్ సీసీ ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడుతాయి

ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: ఎన్సిసి ద్వారా యువతలో శారీరక, మానసిక వికాసంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని ఎన్సిసి సీనియర్ ఆఫీసర్ గాలి అశోక్ అన్నారు. మంగళవారం స్థానిక ఇందిరా ప్రియదర్శి స్టేడియంలో ఎన్సిసి కెడెట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుండి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా.. వారికి లాంగ్ జంప్, హైజంప్, పరుగుపందెం తదితర పోటీలను నిర్వహించి సామర్థ్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్సిసి సీనియర్ ఆఫీసర్ గాలి అశోక్ మాట్లాడుతూ ఎన్సిసిలో ప్రవేశాలకు వివిధ కళాశాలల విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. ఎంపికైన వారికి మూడేళ్ల పాటు వివిధ స్థాయిలో శిక్షణలుంటాయని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు సి సర్టిఫికెట్ అందజేయబడుతుందని.. దీని ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ తో పాటు యూనిఫాం డ్యూటీలో 60 శాతం వరకు రిజర్వేషన్ కల్పించబడితుందని తెలియజేశారు. ఎన్సిసి ద్వారా దేశభక్తి, దేశ రక్షణలో సేవ చేసే బాధ్యత, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. లెఫ్టినెంట్ లక్ష్మణ్ పుట్ట మాట్లాడుతూ ఎన్సిసి ద్వారా డ్రిల్, పరేడ్, ఫైరింగ్ సామాజిక బాధ్యత, జాతి సంక్షేమం దేశ సమగ్రత క్రమశిక్షణ మరియు ఐక్యత అలవర్చుకొని జాతి అభివృద్ధిలో భాగస్వాము కావాలని అన్నారు. ముఖ్యంగా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఎన్రోల్మెంట్ అయినటువంటి ఎన్సిసి కాడేట్స్ ను ఉద్దేశించి పిలుపునిచ్చారు..కార్యక్రమంలో లెఫ్ట్ నెంట్ భూమన్న, కేర్ టేకర్ చంద్రకాంత్, బెటాలియన్ అధికారులు సుబేధర్ కావాలజిత్ సింగ్, సుభేదర్ సునీల్ కుమార్, హావలధర్ దేవేందర్ కుమార్, హవాళదేర్ బిఎన్ సింగ్, ఆదిత్య గౌడ్, ఎన్సీసి సీనియర్స్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఆ కామెంట్స్ నన్ను బాధించాయి అంటున్న జాన్వీ కపూర్......



బాలీవుడ్ లో అతిలోక సుందరి శ్రీదేవి కూతురు అనే బ్రాండ్ ఇమేజ్ తో హీరోయిన్ గా అడుగుపెట్టిన అందాల భామ జాన్వీ కపూర్. ఈ అమ్మడు కెరియర్ ఆరంభం నుంచి కమర్షియల్ సినిమాలు కంటే కథాబలం ఉండి తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకునే సినిమాలే ఎక్కువగా చేస్తూ వస్తుంది. రెండో సినిమానే ఏకంగా బయోపిక్ కథని ఎంపిక చేసుకొని అందరికి షాక్ ఇచ్చింది. ఈ మూవీతో కూడా ఆమె మెప్పించింది. ఇక ఫిమేల్ సెంట్రిక్ కథలతో ఈ అమ్మడు వరుస సినిమాలు చేసుకుంటూ వెళ్తుంది. ఇప్పుడు కమర్షియల్ సినిమాల వైపు దృష్టి పెడుతుంది. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకోవడంతో కమర్షియల్ హీరోయిన్ గా ఎస్టాబ్లిష్ అయ్యే ప్రయత్నం మొదలు పెట్టింది. ఇదిలా ఉంటే తాజాగా ఈ అమ్మడు ఓ ఇంటర్వ్యూలో తన కెరియర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. సినిమా ఇండస్ట్రీలోకి నటిగా అడుగుపెట్టిన ఆరంభంలో చాలా మంది తనని నెపోకిడ్ అంటూ సోషల్ మీడియాలో దారుణంగా విమర్శిస్తూ కామెంట్స్ చేసేవారు. నటన రాకుండా ఎందుకు హీరోయిన్స్ అయిపోతారో అంటూ వేధించారు. ఆ కామెంట్స్ చూసినపుడు తీవ్రంగా బాధేసింది. కొన్ని సందర్భాలలో ఆ కామెంట్స్ చూసి కన్నీళ్లు వచ్చేవి. ఎంత బెటర్ గా నటించి మెప్పించే ప్రయత్నం చేసిన కూడా ప్రతి సారి కూడా నెపోకిడ్ ఆమె విమర్శలు వినిపిస్తూ ఉండేవి. తల్లిదండ్రులు సెలబ్రిటీలుగా వారి పిల్లలు సెలబ్రిటీలుగా నటిగా కెరియర్ ఎంచుకొకూడదా అని వారి విమర్శలు చూసినపుడు అనిపించేది.

# ఆ మహిళలతో ఉండటం ఆనందంగా ఉంది - అడవి శేష్

టాలీవుడ్ లో తన మార్క్ స్టోరీ టెల్లింగ్ తో ఎంతో పేరు తెచ్చుకున్నాడు అడవి శేష్. ప్రత్యేక కథలతో థ్రిల్లింగ్ సస్పెన్స్ నేపథ్యంలో సినిమాలు తీస్తూ హిట్ మీద హిట్ కొడుతున్నాడు. తాజాగా హిట్-2తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు ఈ టాలర్ స్టార్. తాజాగా ఈ హీరో తన ఇన్‌స్టా వేదికగా చేసిన ఓ పోస్టు చాలా మందిని ఆకట్టుకుంటోంది. అందులో అడవి శేష్ తో పాటు బాలీవుడ్ డైరెక్టర్ ప్రొడ్యూసర్ కొరియోగ్రాఫర్ అయిన ఫరాఖాన్ బుట్ట బొమ్మ పూజా హెగ్డేతో కలిసి ఉన్న పిక్ ను పోస్టు చేశారు. ఫరాఖాన్ డైరెక్టర్ గా అడవి శేష్ - పూజా హెగ్డే హీరోహీరోయిన్లుగా ఓ సినిమా తెరకెక్కనుందని అనుకుంటే పొరబడినట్లే. ఎందుకంటే వీరు కలిసింది సినిమా కోసం కాదు. హైదరాబాద్ లో జరిగిన ఫిక్కీ సమావేశానికి వీరు హాజరయ్యారు. ఓ పిక్ లో అడవి శేష్ ఫరాఖాన్ పూజా హెగ్డేతో పాటు ఫిక్కీ ఫ్లో మాజీ ప్రెసిడెంట్ పింకీ రెడ్డితో కలిసి కనిపించారు. మరో పిక్ లో అడవి శేష్ ఫరాఖాన్ పింకీ రెడ్డి ఉన్నారు. ఈ రెండు పిక్స్ పోస్టు చేసిన అడవి శేష్.. వీరితో అద్భుతమైన సమయాన్ని గడిపినట్లు క్యాప్షన్ ఇచ్చారు. సూపర్ వైబ్రంట్ ఫరా ఖాన్ లవ్లీ పూజా హెగ్డే లాంటి విజయవంతమైన విద్యావంతులైన మహిళలతో కలిసి సమావేశంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పోస్టులో పేర్కొన్నాడు. ఈ యంగ్ హీరో వరుస విజయాలు అందుకుంటూ దూసుకుపోతున్నాడు. గూఢచారి ఎవరు మేజర్ తో హ్యాట్రిక్ విజయాలు సాధించిన అడవి శేష్.. ఇప్పుడు డబుల్ హ్యాట్రిక్



పై కన్నేశాడు. ఈ క్రమంలో ఇటీవలె హిట్-2 తో మరో భారీ సక్సెస్ ఖాతాలో వేసుకున్నాడు. దీంతో తదుపరి రెండు సినిమాలతోనూ హిట్లు అందుకుని డబుల్ హ్యాట్రిక్ నమోదు చేయాలని ప్లాన్ వేశాడు. ఈక్రమంలోనే గూఢచారికి సీక్వెల్ గా జీ-2 ను పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు ప్రకటించారు. మేజర్ తో దక్కిన పాన్ ఇండియా క్రేజ్ ని ఎన్ క్యాష్ చేసుకునేలా ఈ సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారు.

# జిగేల్ అనిపించేలా నిధి సోషల్ సోయగాలు..!

ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ సినిమాల లెక్క ఎలా ఉన్నా సోషల్ మీడియాలో మాత్రం విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత కేవలం ఒకటి రెండు సినిమాలే చేసిన అమ్మడు ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో హరి హర వీరమల్లు సినిమాలో నటిస్తుంది. ఆ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకుంది నిధి. గల్లా అశోక్ డెబ్యూ మూవీ హీరో లో నటించిన అమ్మడు మరో సినిమాకు సైన్ చేయలేదు. తమిళ్ లో సినిమాలు కొన్ని చేసి అక్కడ క్రేజ్ ఏర్పరచుకుంది. అయితే తెలుగులో ఛాన్స్ లు రాక చేయట్లేదా లేక వచ్చిన అవకాశాలను అమ్మడు కాదంటుందా అన్నది తెలియాల్సి ఉంది.పవన్ సినిమా తప్ప నిధి అగర్వాల్ మరో తెలుగు సినిమాకు సైన్ చేయలేదు. ఇక సినిమాలతో సంబంధం లేకుండా అమ్మడు సోషల్ మీడియాలో రెచ్చిపోతుంది. నిధి అగర్వాల్ ఫోటో షూట్ సోషల్ మీడియా ఫ్యాన్స్ కి స్పెషల్ సర్ ప్రైజ్ అందిస్తున్నాయి. లేటెస్ట్ గా నిధి తన క్రేజీ లుక్స్ తో మరోసారి తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని బుట్టలో వేసుకునే ప్రయత్నం చేసింది. స్లీవ్ లెస్ జాకెట్.. తొడలు కనిపించేలా మిడ్డితో అమ్మడి ఫోటో షూట్ అదరహో అనిపిస్తుంది. అలా క్యూట్ గా చూస్తున్నా తన చూపుల మాయలో పడిపోయి ప్రేక్షకులు గిల గిల తన్నుకుంటున్నారని చెప్పొచ్చు. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకోవాలనే తాపత్రయం ఉన్నా అవకాశాలు పెద్దగా లేకపోయే సరికి సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ తో రెచ్చిపోతుంది అమ్మడు. అంతేకాదు సోషల్ మీడియాలో తనకున్న ఈ క్రేజీ ఫాలోయింగ్ చూసి ఆమెతో ప్రొడక్ట్ ప్రమోషన్స్ చేయించుకుంటున్నారు. వాటి వల్ల కూడా ఆదాయం వస్తుండటంతో అమ్మడు అలా కూడా సంపాదిస్తుంది.



ఇన్ స్టాగ్రాం ఓపెన్ చేస్తే చాలు నిధి తన యాడ్స్ తోనే కెరీర్ కొనసాగిస్తుందని అనిపిస్తుంది. వీరమల్లు సినిమా రిలీజ్ అయ్యాక ఏమన్నా మళ్లీ తెలుగులో నిధి అగర్వాల్ బిజీ అయ్యే ఛాన్స్ ఉందేమో కానీ ప్రస్తుతం నిధి కేవలం సోషల్ మీడియాతోనే టైం పాస్ చేస్తుంది. ఆమెను ఇన్ స్టాగ్రామ్ లో చూసి సంతృప్తి చెందుతున్న ఫ్యాన్స్ కూడా ఉన్నారు. అందుకే నిధి గేర్ మార్చి తన సినిమాల వేగాన్ని పెంచితే ఈ క్రేజ్ డబుల్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. మరి నిధి అగర్వాల్ తన సినిమాల విషయంలో ఆలోచన మార్చుకుంటుందా లేదా అన్నది చూడాలి.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ప్రియాంక జవాల్కర్ .. హద్దులు దాటేస్తోందిగా..



యంగ్ హీరోయిన్ ప్రియాంక జవాల్కర్ తెలుగు అభిమానులకు పరిచయం అవసరం లేని పేరు. ఇక ఈ ముద్దుగుమ్మ గ్లామర్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తొలిచూపులతోనే గుండెల్ని కొల్లగొట్టే అందం ఆమె సొంతం. అచ్చమైన తెలుగు హీరోయిన్ గా ప్రేక్షకులను అలరిస్తోంది. అలా ఓ వైపు సినిమాలు మరో వైపు హాట్ హాట్ సొగసులతో కుర్ర కారు గుండెల్ని పిండేసేలా రచ్చ చేస్తోంది. గ్లామర్ విందుతో మతులు పోగొట్టే ఈ బ్యూటీ.. అదిరిపోయే అవుట్ ఫిట్ లో దర్శనమిస్తూ రోజు రోజుకూ మరింతగా మతులు పోగొడుతోంది.ఈ మధ్య తగ్గేదే లేదు అంటూ యమా ఉషారెక్కిస్తుంది అభిమానులను. నిత్యం సోషల్ మీడియాలో ఆక్టివ్ గా ఉంటూ హాట్ ట్రెండీ లో ఫోజులిస్తోంది. హాట్ క్లీవేజ్ షోతో మత్తెక్కిస్తోంది. రోజు రోజుకీ తెగ మెరిసిపోతూ కవ్వ్ కవ్విస్తోంది. అందం అంత నాదగ్గరే ఉందంటూ తెగ ఎక్సపోసింగ్ చేస్తూ కుర్ర కారుకి చమటలు పట్టిస్తుంది. ట్రెడిషనల్ వేర్ ట్రెండీ వేర్ లో దర్శనమిస్తూ ఫాలోయర్స్ ను ఊర్రూతలూగిస్తోంది. తాజాగా మరో కొత్త ఫోటో షూట్ ను పోస్ట్ చేసింది. ఇవి చూస్తుంటే ప్రస్తుతం ప్రియాంక దుబాయ్ లో ఉన్నట్టు తెలుస్తోంది. వేకేషన్ కోసం అక్కడికి వెళ్లిందా? లేదా ఏమైనా చమూవీ షూటింగ్ కోసం వెళ్లిందా? అన్నది క్లారిటీ లేదు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com